www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 59 మంగళవారం, జూలై 14, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం
# కుదరదు

**- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ**

**- పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి**




**న్యూఢిల్లీ,జూలై 13 :** పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు మిగతా2లో...

## పవన్ కళ్యాణ్‌కు సిఎం ఫడ్నవీస్ పరామర్శ



**ముంబై,జూలై 13 :** తన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని ఫడణవీస్ అడిగి తెలుసుకున్నారు. ఆయన మిగతా2లో...




### ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు
## ప్రభుత్వం సన్నద్ధం

● మూడు దశల ముందస్తు కార్యాచరణ ● ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష ● కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి ● వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై బులెటిన్ విడుదల ● 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన ● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జూలై 13 :** ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మిగతా2లో...

## కేంద్ర సహకారంతోనే
# అభివృద్ధి సాధ్యం

- పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి
- మెట్రో, ట్రిపుల్ ఆర్ తదితర అంశాలపై అనుమతులు రాబట్టాలి
- ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు
- సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు



**హైదరాబాద్,జూలై 13 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. మిగతా2లో...

### షాబాద్ నరహంతకుడు
# మృతి

- పురుగుల మందు తాగి ఆత్మహత్య
- సూసైడ్‌కు ముందు సెల్ఫీ వీడియో
- కొత్తూరు మండలంలో ఘటన
- వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి


2లో

## సాధ్యమైనంత మేర గోదావరి
# జలాల వినియోగం


- మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక మేరకు నడుచుకుంటున్నాం
- సమ్మక్క ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు



2లో

## జాడలేని వర్షాలు...
## ముఖం చాటేసిన మబ్బులు

**- మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**


2లో



### సుప్రీం సాక్షిగా బయటపడ్డ
## రేవంత్ వైఫల్యం

- బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులదడక
- గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు
- మరోమారు మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు

**సంగారెడ్డి,జూలై 13 :** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబుకి మిగతా2లో...

## సింగరేణిని భ్రష్టు పట్టించిన
# బిఆర్ఎస్, కాంగ్రెస్

● గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు ● అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది ● సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 13 :** సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని మిగతా2లో...

## సిఎం రేవంత్
## దిగజారుడు భాష

**- బూతుపురాణాలు సరికాదు**

**- ఎంపి ఈటెల రాజేందర్ హితవు**



**హైదరాబాద్,జూలై 13 :** రాష్ట్ర చరిత్రలో అత్యంత దిగజారుడు భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలను అందునా బీఆర్ఎస్ లక్ష్యంగా బూతు పురాణం అందుకుంటున్న మిగతా2లో...

# సాధ్యమైనంత మేర గోదావరి జలాల వినియోగం

**ములుగు,జూలై 13 :** రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలను సాధ్యమైనంత మేర వినియోగించు కోవాలని నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సమక్క బ్యారేజ్‌లో గేట్లు మూసివేయడం వల్ల 71 మీటర్ల ఎత్తులో నీటి నిల్వలు ఉన్నాయని, అందువల్ల దేవాదుల ప్రాజెక్టు ద్వారా 7 మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వస్సల్ టోప్పో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత సమక్క బ్యారేజ్, దేవాదుల ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు గోదావరి జలాల వినియోగం, కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారికి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజ్‌కు ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారని, వారి సూచనలను పాటిస్తున్నామని తెలిపారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే మూడు బ్యారేజీలు ఎందుకు నిర్మించారో మాజీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వెల్లడించారు. సమక్క బ్యారేజ్‌లో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ సులభమవుతుందని చెప్పారు.

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నుంచి ప్రవహించే నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పుడు భారీ బ్యారేజీల నిర్మాణం ఎందుకు చేపట్టారో మాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఇంజినీర్ల సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన అనేక డ్యామ్‌లు సురక్షితంగా ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపోయాయని ఆరోపించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని తెలిపారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయొద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గత ప్రభుత్వ హయాంలోనే సూచించిందని గుర్తుచేశారు. డిజైన్ మార్పులు, నాణ్యతా లోపాల కారణంగానే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని.. మరమ్మతులకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు.

# ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మి÷-లలెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునే విధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితు లను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధ రంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం వంటి అవకాశాల ను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపది కగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగ స్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవు తాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# షాబాద్ నరహంతకుడు మృతి

**కొత్తూరు,జూలై 13 :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో అతి కిరాతకంగా ఆరుగురిని హత్య చేసిన హంతక ఉన్మాది రాజ్ కుమార్ కథ విషాదంగా ముగిసింది. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. కొత్తూరు మండలంలోని పెన్జర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్ సమీపంలోని వ్యవసాయ పొలంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించేందుకు మృతిని సోదరుడు, పెంజర్ల గ్రామంలో నివాసముండే మేనమామలను పిలిపించారు. వారు రాజ్ కుమార్ (29) మృతదేహాన్ని గుర్తించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా పడి ఉంది. ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితుడు రాజ్‌కుమార్.. షాబాద్‌లో ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. దాంతో మే నెలలో ఇతనిపై బాలిక బంధువులు ఫిర్యాదు చేయడంతో షాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు పెట్టారన్న కోపం పెంచుకున్న నిందితుడు.. శుక్రవారంఅర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి.. ఆమె తల్లి, అమ్మమ్మను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం బాలికను తీసుకొని దైవాలగూడానికి చేరుకొని, అతని సొంత ఇంట్లో భార్య, ఇద్దరు కుమారులను కుడా కత్తితో పొడిచి చంపాడు. తిరిగి అక్కడ నుండి బాలికను తీసుకొని సుమారు 200 మీటర్ల దూరంలో బాలికను కూడా హత్య చేసి పరారయ్యాడు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి.. 'నేను ఆరుగురిని హత్య చేశాను.. నేను కూడా ఆత్మహత్య చేసుకుంటున్న' అని చెప్పాడు. అయితే ఆరుగురి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కొత్తూరు మండలం పెంచర్ల రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆ మృతదేహం రాజ్ కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితునికి ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా అలవాటు ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి సుమారు రూ.2కోట్లు అప్పు చేశాడు. దాంతోపాటు అతడు 16 సిమ్ కార్డులను తీసుకొని నెంబర్లు మారుస్తూ వాడుతున్నాడు. **వాడిని అంత ప్రశాంతంగా చనిపోనియాల్సింది కాదు..: మృతుని సోదరుడు భాస్కర్** అభం శుభం తెలియని పసిపిల్లలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలు తీసిన రాజ్‌కుమార్ అంత ప్రశాంతంగా చనిపోవాల్సింది కాదని, వాడిని ఎన్‌కౌంటర్ చేసి చంపాల్సిందని మృతుని సోదరుడు భాస్కర్ అన్నారు. వాడి వల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఏడుస్తూ పోలీసుల ముందు మొరపెట్టుకున్నాడు.


# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

(మొదటి పేజీ తరువాయి)

గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు.గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకో వడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ము కుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచా టుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు.

# జాడలేని వర్షాలు... ముఖం చాటేసిన మబ్బులు

## - మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు




**హైదరాబాద్,జూలై 13 :** తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది.రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి  కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు.

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధి ంచి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి  ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది.

120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు. గోదావరి, కావేరి నదుల అనుసం ధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ దిగజారుడు భాష

(మొదటి పేజీ తరువాయి)

సీఎం తీరుపై ఆయన స్పందించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీళ్లు 94 మీటర్లు లేకున్నా కేవలం రూ.2 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు. అది వదిలేసి సలహాలు ఇస్తున్న ఇంజినీర్లను తిట్టడం, బీఆర్ఎస్ నాయకుల రక్తం చిందిస్తా అనడం మూర్ఖత్వమన్నారు. రేవంత్ రెడ్డి నాకు ఎన్‌డీఎస్ఏ చెప్తేనే ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుతా అని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్లు ఎక్కడా కుంగిపోలేదని, ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ ప్రకారం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు గ్రౌటింగ్ కూడా చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్ళు నింపుతామని రేవంత్ రెడ్డి ఎన్‌డీఎస్ఏ దగ్గరికి వెళ్ళి అడిగాడా? అని నిలదీశారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు.

# పవన్ కళ్యాణ్‌కు సిఎం ఫడ్నవీస్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై కూడా వివరాలు ఆరా తీశారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడణవీస్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు ఆత్మీయంగా పలుకరించుకున్నట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో అభిమానులు, జనసేన కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# స్వగ్రామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసిన "గ్రీన్ డ్రైవ్-26"

**-- 1,000కు పైగా మొక్కల నాటాము**

**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 13(పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా అటవీ శాఖ ఇంచెంచెర్వుపల్లి గ్రామపంచాయతీ సహకారంతో స్వగ్రామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన "గ్రీన్ డ్రైవ్-26" కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో 25 మందికి పైగా యువత, మహిళలు, విద్యార్థులు గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని 1,000కు పైగా మొక్కలను నాటారు.ఈ సందర్భంగా స్వగ్రామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ మర్రి క్రాంతి రెడ్డి మాట్లాడుతూ,"భవిష్యత్ తరాలకు మనం అందించే అత్యంత విలువైన ఆస్తి పచ్చని ప్రకృతే. ఈ రోజు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, చల్లని నీడ, పర్యావరణ సమతుల్యతను అందిస్తుంది. ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించి పెద్ద వృక్షాలుగా తీర్చిదిద్దినప్పుడే ఈ కార్యక్రమం నిజమైన విజయాన్ని సాధిస్తుంది. భవిష్యత్ తరాల కోసం పచ్చని గ్రామాల నిర్మాణమే మా లక్ష్యం." అని అన్నారు.అలాగే, సమాజంలోని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, గ్రామాలు పచ్చగా మారితేనే భవిష్యత్ ఆరోగ్యవంతంగా, సుస్థిరంగా ఉంటుందని ఆయన పిలుపునిచ్చారు.ఈ గ్రీన్ డ్రైవ్-26 విజయవంతం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి స్వగ్రామ్ ఫౌండేషన్ తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



# వెంకటాపూర్ మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన

**- ఎన్నికల నమోదు అధికారి,ఆర్డీవో కృష్ణవేణి**




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 13 (పీపుల్స్ న్యూస్)**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట, బూర్గుపేట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, బీఎల్ఓ యాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత బీఎల్ఓలకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మండల తహసిల్దార్ గిరిబాబు, డిప్యూటీ తహసిల్దార్ భవాని ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నితీష్ ,బి ఎల్ ఓ లు సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంకు జంగాలపల్లి ముందు ధర్నా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం.

**- జిల్లా కార్యదర్శి ఎం డి అంజాద్ పాషా**
**తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోర్ర రాజు.**





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 13( పీపుల్స్ న్యూస్)**
ములుగు మండలంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జంగాలపల్లి బ్యాంకు ముందు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మరియు తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలు అయినా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగా పంట రుణాలు ఇవ్వాలని సకాలంలో రైతుల రుణాలను రెన్యువల్ చేయాలని పహాని న కల్ ఆధారంగా కొత్త పంట రుణాలు ఇవ్వాలని ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నా నుద్దేశించి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజాద్ పాషా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోరరాజు పాల్గొని మాట్లాడుతూ జంగాలపల్లి యూనియన్ బ్యాంకు పరిధిలోని రైతులు సకాలంలో పంట రుణాలు రెనివలు కాక నానా రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంట రుణాలను ప్రభుత్వం ప్రకటించినట్టు గా ఆయా పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకు పరిధిలోని అటవీ హక్కుల పత్రాల రైతులకు అసైన్డ్ భూములు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని గ్రామాన్ని యూనిట్గా తీసుకొని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని పహాని నాకు అలా ఆధారంగా తీసుకున్న పంట రుణాలను కూడా పూర్తిగా రుణమాఫీ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను బ్యాంక్ అధికారులను డిమాండ్ చేయడం జరిగింది ఈ ధర్నా వినతిపత్రం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు మంకిడి కృష్ణయ్య కన్నాయిగూడెం మాజీ సర్పంచ్ నీ లా దేవి గొర్రె రాజక్క వాంకుడోత్ రవి రాజు బొంకూరు రమ శవాల సంపత్ ధనలక్ష్మి రాజ్ బి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు పాసులు ఇవ్వాలి

- **టిడబ్ల్యూజేఎఫ్ డిమాండ్..**
- **కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో వినతిపత్రం సమర్పణ**
- **మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం**




**బాలానగర్ జలై 14 (పీపుల్స్ న్యూస్)**
రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ రాష్ట్రవ్యాప్త ఉచిత బస్సు పాసులు జారీ చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరారు.ఈ మేరకు సోమవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో అధికారులకు టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నారని తెలిపారు. అలాంటి జర్నలిస్టులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీ సంస్థకు పెద్దగా భారం ఉండదని పేర్కొన్నారు. ప్రస్తుతం జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో మూడో వంతు (ఒక మూడవ వంతు) రాయితీ పేరుతో ప్రయాణ సౌకర్యం ఉన్నప్పటికీ, వాస్తవానికి దాదాపు 50 శాతం వరకు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇప్పటికే తక్కువ ఆదాయంతో పనిచేస్తున్న జర్నలిస్టులపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. రాష్ట్రంలోని అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోయినా జర్నలిజం వృత్తినే నమ్ముకొని సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ప్రతి రోజు వార్తల సేకరణ కోసం గ్రామాలు, పట్టణాలు తిరగాల్సి వస్తుండటంతో ఆర్టీసీ బస్సులనే ఎక్కువగా ఆశ్రయిస్తున్నారని, పెరిగిన ప్రయాణ ఖర్చులు వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని, అదే విధంగా సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టులకు కూడా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంఖ్యాపరంగా తక్కువగా ఉన్న జర్నలిస్టులకు ఈ సౌకర్యం కల్పించడం ద్వారా వారి వృత్తి నిర్వహణకు ఎంతో ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను నిర్వర్తిస్తున్నారని, అలాంటి వృత్తి నిపుణులకు ఉచిత ఆర్టీసీ బస్సు పాసులు మంజూరు చేయాలని ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని టిడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు నాగార్జున, షబ్బీర్, చందు, నాగరాజు, రాజులు పాల్గొని వినతిపత్రానికి మద్దతు తెలిపారు.

# ప్రజా వాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం/జూలై13/(పీపుల్స్ న్యూస్)**
ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి.ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేగుంటలో పాఠశాల పక్కనే మురుగు కంపు - విద్యార్థుల ఆరోగ్యం ప్రశ్నార్థకం

**- పిల్లల భవిష్యత్తు మురుగులోనా**

**చేగుంట జూలై 13**
చేగుంటలోని మండలశీ చేగుంట ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ గోడ ఆనుకుని ఉన్న మురుగు నీరు,కాలువ చెత్తాచెదారంతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. స్కూల్ ప్రహరీ గోడకు ఆనుకుని నల్లటి మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా స్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలం మొత్తం చెత్తకుప్పగా మారింది.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మురుగు కాలువను శుభ్రం చేయించి,చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





# నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయండి'

**ఖమ్మం రూరల్, జూలై 13 :** ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కార్యదర్శి బొడ్డు మధు అన్నారు. ఖమ్మం మండలంలోని పొన్నెకల్ గ్రామంలో సోమవారం డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు మధు మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా అధికారంలోకొస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు కనీసం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ సమస్యతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే మూసీ నది ప్రక్షాళన, హైడ్రా, ఫుట్ బాల్ అంటూ ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నాడని విమర్శించారు.నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత, నిరుద్యోగులు పార్టీలకు, సంఘాలకు పార్టీలకు భారీ సంఖ్యలో హాజరై ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వేల్పుల ప్రవీణ్, సీనియర్ నాయకులు కత్రం ఉపేందర్, డీవైఎఫ్ఐ నాయకులు పాషా, సాగర్, నరేష్, కిరణ్,, రాజేష్ పాల్గొన్నారు.

# దేవాదుల ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం.

- ●దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత ఉండదు.
- ●22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపుతాం.
- ●దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం.
- ●38.16 టీఎంసీల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తాం.
- ●భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం.
- ●రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.
- ●ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనే కార్యాచరణ అమలు
- ●గోదావరి జలాలతో రైతాంగానికి పూర్తి భరోసా కల్పిస్తాం.
- ●ప్రాజెక్టు పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగిస్తాం.
- ●పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేశాం.
- ●సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం.
- ●దేవాదుల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తాం.
- ●రాష్ట్రఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క

































**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 13( పీపుల్స్ న్యూస్)**

దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగిస్తామని, 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి దేవాదుల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు రైతులకు గోదావరి జలాలతో శాశ్వత భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూసేకరణను వేగవంతంగా పూర్తి చేసి, ప్రాజెక్టు పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించడంతో పాటు పెండింగ్ బిల్లులను ఇప్పటికే విడుదల చేశామని, సాగునీరు--తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనే కార్యాచరణను కూడా అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క తెలిపారు.సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గార్లకు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ. లెనిన్ వస్సల్ టోప్పో, డి ఎఫ్ ఓ వికాస్ మినాలు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె చొక్కా రావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను, మోటార్ల పనితీరును, ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం, సాగు త్రాగునీరు, మోటార్ల పనితీరు పై పి పి టి ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ఇట్టి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు, తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూర దృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం తో కలిసి పలు మార్లు విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉండబోతోందో, దాని వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరా, జలవనరులపై కలిగే ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై లోతుగా చర్చించి ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలని, ఎక్కడెక్కడ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందో అక్కడ ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇందుకోసం ఎంత వ్యయంతో కూడుకున్న , విద్యుత్ బిల్లులు ఎంత భారమైనా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెనుకాడబోమనే స్పష్టమైన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు.గోదావరి జలాలను లిఫ్ట్ చేసి వ్యవసాయ భూములకు సాగునీరు అందించడం, చెరువులను నింపడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాలకు, పట్టణాలకు తాగునీటిని సమృద్ధిగా అందించడం లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్రంలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అత్యంత కీలక ప్రాజెక్టు అని, ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి రైతులకు నమ్మకమైన నీటి వనరును అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో తీసుకుంటున్న ఈ చర్యల వల్ల ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించడం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడడం, సాగునీటి వనరులను బలోపేతం చేయడం సాధ్య మవు తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని, ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పంపింగ్ వ్యవస్థ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూసేకరణ, పెండింగ్ పనులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అధికారులతో కలిసి ప్రాజెక్టు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు.దేవాదుల ప్రాజెక్టులో ఉన్న 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని, మరో ఒకటి రెండు రోజుల్లో అన్ని 10 పంపులను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ములుగు, వరంగల్ చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు.ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లలో వివిధ దశల్లో నీటిని నింపుతున్నామని, ఒక్క రిజర్వాయర్ కూడా ఖాళీగా ఉండకుండా పూర్తి సామర్థ్యంతో నింపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టు పనులకు సంబంధించి రూ.194 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారని, ఆర్థిక శాఖ మంత్రి సహకారంతో ఆ రూ.194 కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు.ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. అవసరమైన నిధులు ఎంతైనా ప్రభుత్వం సమకూరుస్తుందని, భూసేకరణ కారణంగా ప్రాజెక్టు పనులు ఎక్కడా ఆగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 38.16 టీఎంసీలు అని పేర్కొంటూ, ఆ సామర్థ్యానికి అనుగుణంగా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టు రూపకల్పనలో ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు రెండింటికీ నీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ప్రాజెక్టు అమలులో ఎక్కడైనా సాంకేతిక లేదా పరిపాలనాపరమైన అడ్డంకులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చీఫ్ ఇంజనీర్లకు సూచించారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గోదావరి జలాలను అత్యధికంగా వినియోగించి తెలంగాణ చరిత్రలోనే అత్యధిక వ్యవసాయ విస్తీర్ణంలో పంటలు సాగు చేశామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక వరి దిగుబడులు ప్రజా ప్రభుత్వ హయాంలోనే నమోదయ్యాయని చెప్పారు.యాసంగి సీజన్‌లోనే 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి, వరి కొనుగోళ్ల రూపంలో సుమారు రూ.84 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేశామని, యాసంగి పంటకే రూ.19 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఇందులో దాదాపు 92 శాతం ఆయకట్టు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉండగా, మిగిలిన భాగం నల్లగొండ జిల్లాలో విస్తరించి ఉందన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రాజెక్టును సందర్శించి, ఏడాది వ్యవధిలో పూర్తిచేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారని తెలిపారు. ఆ లక్ష్య సాధన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు.

ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నందుకు ప్రజా ప్రభుత్వానికి ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3లలోని 10 మోటార్ల ద్వారా రోజుకు సుమారు 0.25 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉందన్నారు. దేవాదుల ప్రాజెక్టు సమర్థవంతంగా పనిచేయాలంటే నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, పంపుల నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ మధ్య సమన్వయం అత్యంత కీలకమని, ఈ మూడు వ్యవస్థలు సమిష్టిగా పనిచేస్తేనే పంపింగ్ వ్యవస్థ నిరంతరాయంగా కొనసాగి రైతులకు సకాలంలో సాగునీరు అందుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# హాష్ ఆయిల్ కలిగి ఉన్న ముగ్గురు నిందితులతో పాటు ఇద్దరు వినియోగదారులు అరెస్టు







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 13 (పీపుల్స్ న్యూస్)** :హాష్ ఆయిల్ కలిగి ఉన్న ముగ్గురు నిందితులతో పాటు ఇద్దరు వినియోగదారులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రూ. 16,00,000 విలువ గల 1.250 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం... హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, సికింద్రాబాద్ జోన్ టీమ్ మరియు జూబ్లీహిల్స్ పోలీసులు సంయుక్తంగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోడ్ నంబర్ 10, సింప్లీ సౌత్ రెస్టారెంట్ వైపు వెళ్లే మార్గంలో దాడి చేసి, ముగ్గురు (03) మాదకద్రవ్యాల నిందితులను ,ఇద్దరు (02) వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులైన అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి కి చెందిన బొనాంగి చిన్నయ్య పడాల్(24 ),, జగద్గిరిగుట్ట కు చెందిన పడమటింటి భరత్ కుమార్(23) ఈయనకు గతంలో సైబరాబాద్ , రాచకొండ కమిషనరేట్ పరిధిలో 18 ఆస్తి నష్ట/దొంగతనం కేసులలో ప్రమేయం ఉంది జూబ్లీహిల్స్కు చెందిన మహమ్మద్ షోయబ్( 20) , బాలానగర్ కు చెందిన భోగం కల్యాణ్ తేజ(22) ఈయనకు గతంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో 01 చీణూలా కేసులో ప్రమేయం ఉంది జగద్గిరిగుట్టకు చెందిన తుడపల్లి ఉదయ్ కుమార్(25 ) అదుపులోకి తీసుకోగా ఒడిశా కు చెందిన లాబీ పరారీలో ఉన్నారు. పడమటింటి భరత్ కుమార్ , మహమ్మద్ షోయబ్ ఇద్దరూ స్నేహితులు. వారు తమ విలాసవంతమైన జీవితానికి అవసరమైన సులభమైన డబ్బు కోసం హైదరాబాద్ నగరంలో హాష్ ఆయిల్‌ను సేకరించి విక్రయిస్తున్నారు. జూన్ 2026 లో, మహమ్మద్ షోయబ్ నిధులు సమకూర్చగా, భరత్ కుమార్ ఆంధ్రప్రదేశ్‌లోని నర్సీపట్నంలో చిన్నయ్య పడాల్ నుండి 600 మి.లీ. హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేశాడు. భరత్ కుమార్ దానిని ఒక్కొక్కటి సుమారు 4 మి.లీ. పరిమాణంలో చిన్న కంటైనర్లలోకి తిరిగి ప్యాక్ చేసి, ఒక్కో డబ్బాని ?3,000 చొప్పున విక్రయించి భారీ లాభాలను ఆర్జించాడు. జూలై 2026 మొదటి వారంలో, భరత్ కుమార్ మళ్లీ చిన్నయ్య పడాల్‌ను సంప్రదించి, తన స్నేహితుడు మహమ్మద్ షోయబ్ కోసం 1 లీటరు హాష్ ఆయిల్‌ను ఆర్డర్ చేశాడు. అదనపు డబ్బు చెల్లిస్తామని, దానిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి డెలివరీ చేయాలని కోరగా, అతను హైదరాబాద్‌లో డెలివరీ చేయడానికి అంగీకరించాడు.నమ్మదగిన సమాచారం మేరకు, కమిషనర్ టాస్క్‌ఫోర్స్ సికింద్రాబాద్ జోన్ టీమ్ మరియు జూబ్లీహిల్స్ పోలీసులు సంయుక్తంగా జూబ్లీహిల్స్ లోని రోడ్ నంబర్ 10, సింప్లీ సౌత్ రెస్టారెంట్ వైపు వెళ్లే మార్గంలో చిన్నయ్య పడాల్, భరత్ కుమార్ , మహమ్మద్ షోయబ్‌లను ఒక ద్విచక్ర వాహనంతో పాటు 01 లీటరు హాష్ ఆయిల్ కలిగి ఉన్న సమయాన అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, మహమ్మద్ షోయబ్ ద్విచక్ర వాహనంలో 50 చిన్న కంటైనర్లు లభ్యమవగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. అదనంగా, భరత్ కుమార్ వద్ద లభించిన 25 చిన్న కంటైనర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా మా బృందం ఇద్దరు వినియోగదారులైన తుడపల్లి ఉదయ్ కుమార్ , భోగం కల్యాణ్ తేజలను అదుపులోకి తీసుకుంది. వారివద్ద నుంచి హాష్ ఆయిల్ 1.250 లీటర్లు. (ఇందులో ఒక్కొక్కటి సుమారు 4 మి.లీ. పరిమాణం ఉన్న 75 చిన్న కంటైనర్లు/డబ్బాలు ఉన్నాయి), సెల్ ఫోన్లు -- 04., ద్విచక్ర వాహనం (టూ-వీలర్). మొత్తం విలువ రూ. 16,00,000/- ఈ మొత్తం ఆపరేషన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షణలో జరిగింది. సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జె. రాజశేఖర్, జూబ్లీహిల్స్ పిఎస్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ యు. శ్రీనివాసులు రెడ్డి, జూబ్లీహిల్స్ పిఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. సత్యనారాయణ, సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. మణికంఠ రాజు , సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.

# అంతర్జాతీయ సదస్సులో వక్తగా గీతం అధ్యాపకురాలు

- గోవాలో జరిగిన ఐసీటీ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్





**పటాన్‌చెరు, జూలై 13** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఏఐడిఎంఎల్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్, గోవాలోని తాజ్ వివాంటాలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 11వ అంతర్జాతీయ ఐసీటీ సదస్సు, అవార్డుల ప్రదానోత్సవంలో గీతం తరఫున ఆహ్వానిత వక్తగా పాల్గొన్నారు. ఈ విషయాన్ని సోమవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.వివిధ రంగాలలో స్మార్ట్, అనుసంధానిత, సుస్థిర పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) పరివర్తనాత్మక పాత్రను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రొఫెసర్ పర్వేకర్ ఒక విశ్లేషణాత్మక ప్రసంగం చేసినట్టు తెలియజేశారు. సాంకేతిక ఆవిష్కరణల ద్వారా వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ఐవోటీకి పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ ప్రసంగంలో నొక్కి చెప్పారన్నారు.మూడు రోజుల పాటు జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై చర్చించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి, సహకార పరిశోధనలకు అవకాశాలను అన్వేషించడానికి ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విధాన రూపకర్తలు, ప్రభుత్వ ప్రతినిధులను ఒక చోట చేర్చిందని తెలిపారు. ఆవిష్కరణలను, సుస్థిర అభివృద్ధిని వేగవంతం చేయడంలో అంతర్విషయ పరిశోధన, బలమైన విద్యా-పరిశ్రమ భాగస్వామ్యాల ప్రాముఖ్యతను ఈ సదస్సు చాటిచెప్పిందన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ పరిశోధకులు, నిపుణుల అత్యాధునిక పరిశోధన కృషిని కూడా ప్రదర్శించినట్టు తెలియజేశారు. ప్రొఫెసర్ పర్వేకర్ భాగస్వామ్యం, నాణ్యమైన పరిశోధనను ప్రోత్సహించడం, ఆవిష్కరణలు పెంపొందించడం, వర్ధమాన సాంకేతికతలపై ప్రపంచ చర్చలకు దోహదపడటం పట్ల గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు.ఈ సదస్సుకు హాజరైన ప్రముఖులలో గోవా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తొలి మహిళా అధ్యక్షురాలు ప్రతిమా గౌరీష్ ధోండ్; మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఏఐటీ) చైర్మన్, సలహాదారు, మెంటర్, అధ్యక్షుడు నితిన్ కుంకోలియంకర్; బెల్ గ్రేడ్ లోని సింగిడునమ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్, ఏఐ ప్రాజెక్టు అధిపతి ప్రొఫెసర్ మిలన్ టూబా తదితరులు ఉన్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్,జూలై,13)** ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.అందులో భాగంగా ఈరోజు భూభారతి 32, పెన్షన్లు 10, ఇందిరమ్మ ఇండ్లు 12, ఇతర సమస్యలపై 22, మొత్తం దరఖాస్తులు 76 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణిలో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడే నిందితుడు అరెస్టు



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 13 (పీపుల్స్ న్యూస్) :** వరుసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడే నిందితుడిని గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేసి చార్మినార్ టాస్క్‌ఫోర్స్ , గుడిమల్కాపూర్ పోలీసులు సంయుక్తంగా 8 కేసులు ఛేదించి, రూ. 10 లక్షల విలువైన 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.... హైదరాబాద్, తలాబ్ కట్ట, జోహ్రా బీ దర్గా కు చెందిన షామ్స్ బిలాల్ అలియాస్ బిలాల్ (28) , కార్ డ్రైవర్ పని చేస్తున్నాడు. కమిషనర్ టాస్క్‌ఫోర్స్ చార్మినార్ జోన్ బృందం, గుడిమల్కాపూర్ పోలీసులతో కలిసి షామ్స్ బిలాల్ అలియాస్ బిలాల్ అనే పాత ద్విచక్ర వాహనాల దొంగను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు 10వ తరగతి వరకు చదివి, ఆ తర్వాత చదువుపై ఆసక్తి లేక మానేశాడు. అనంతరం టాటా ఏస్ వాహనానికి డ్రైవర్‌గా పనిచేయడం ప్రారంభించాడు. కొన్ని సంవత్సరాల తర్వాత అతను మద్యానికి బానిసయ్యాడు. తన వ్యక్తిగత మరియు విలాసవంతమైన ఖర్చులకు డ్రైవింగ్ ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించడం కోసం ద్విచక్ర వాహనాలను దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు. గతంలో కూడా ఇతను ఇటువంటి 18 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలో ద్విచక్ర వాహనాల దొంగతనం కేసుల్లో చంద్రాయణగుట్ట మరియు సైదాబాద్ పోలీసులచే అరెస్ట్ చేయబడి, చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు వెళ్లాడు. జైలు నుండి విడుదలైన తర్వాత కొంతకాలం కార్ డ్రైవర్‌గా పనిచేశాడు. అయినప్పటికీ తన విలాసాలకు, ఆర్థిక అవసరాలకు ఆ సంపాదన చాలకపోవడంతో మళ్లీ ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడటం మొదలుపెట్టాడు. నిందితుడు సాధారణంగా బహిరంగ ప్రదేశాల్లో మరియు నివాస ప్రాంతాలలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకునేవాడు. వాహన యజమానులు లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని, వాహనాలను దొంగిలించి వాటిని అమ్ముకోవడం లేదా తన వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడం చేసేవాడు. పోలీసుల విచారణలో నిందితుడు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు అంగీకరించాడు. నిందితుడి అంగీకార వాంగ్మూలం ఆధారంగా దొంగిలించబడిన 7 ద్విచక్ర వాహనాలు మరియు 1 మొబైల్ ఫోన్‌ను పోలీసులు రికవరీ చేశారు.

# నేటి యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు.



**మెదక్,జూలై,13** సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు . జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సిద్దార్థ జూనియర్ కళాశాల, మెదక్ పట్టణం లో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా అవగాము సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపర్ ఇండియన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తును నాశనం చేస్తుంది,

విద్యార్థులు మాదకద్రవ్యాలకు.దూరంగా ఉండి తమ భవిష్యతను క్రమశిక్షణగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎక్సైజ్ అధికారులు సీఐ నాగేశ్వరరావు, డిటిఎఫ్, సిఐజె, గోపాల్, మెదక్ ఎస్ బి,మాన్సింగ్ సింగ్,సిబ్బంది. సందీప్, మదుసూదన్ రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

# పిల్లల మధ్య సరైన ఎడం

- ఆరోగ్యకరమైన కుటుంబానికి ఆధారం"
అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.



**మెదక్,జూలై,13,** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత కుటుంబ నియంత్రణ సేవలను అర్హులైన దంపతులు వినియోగించుకోవాలి.ప్రపంచ జనాభా దినోత్సవం, 11 జూలై నుండి- 18 జూలై, 2026, నిర్వహణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల , మెదక్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ,పాల్గొన్నారు.జిల్లాలో పర్మనెంట్, టెంపరరీ ఫ్యామిలీ ప్లానింగ్ స్పేసింగ్ మెథడ్స్ (గర్భ నిరోధక పద్ధతులు , ట్యుబెక్టమి, వాసెక్టమి, గర్భ నిరోధక మాత్రలు) వాడుతున్న కుటుంబాలకు జిల్లా కలెక్టర్ శాలువాలు కప్పి అభినందించారు.పిల్లల మధ్య సరైన అంతరం ఉంటే, కుటుంబాలు ఆరోగ్యంగా వుండి వైపుణ్యంతో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్ ,జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డా.జయశ్రీ , మాస్ మీడియా అధికారి అన్వర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి భవనం పరిశీలన జిల్లా వైద్యాధికారి.



**పాపన్నపేట,జూలై,13,**
పాపన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి గణేశ్వర్ సోమవారంసాయంత్రం పరిశీలించారు. సిబ్బందితో కలిసి ఆసుపత్రి లోని గదులను పరిశీలించారు. ఈ ఆరోగ్య కేంద్రం భవనానికి మరమ్మతులు చేస్తామని తెలిపారు . ఈసందర్భంగా ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ అన్వర్,సిబ్బంది చందర్ ఉన్నారు.

## ముత్తాయికోట శివాలయాన్ని దర్శించుకున్న ఎస్పీ



**మెదక్,జూలై,13,**
మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ సోమవారం ముత్తాయికోట శివాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎస్పీకి స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ చారిత్రక విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యం గురించి ఆలయ అర్చకులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఎస్పీ ప్రార్థించారు భక్తులు ఆయనను మర్యాదపూర్వకంగా అభివాదం చేశారు. ఈ సందర్భంగా హవెలిఘనపూర్ ఎసై సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లాకు కీర్తి తెచ్చిన అమర్నాథ్

- ఫెన్సింగ్‌లో మెరిసిన మెదక్ పోలీస్ కానిస్టేబుల్ అమర్నాథ్‌కు ఎస్పీ అభినందనలు



**మెదక్,జూలై,13,**
రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన అమర్నాథ్‌కు ఎస్పీ ఘన సన్మానం,హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి తెలంగాణ పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లా పోలీసు శాఖకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ రసాల అమర్నాథ్ ఫెన్సింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో మెదక్ జిల్లా పోలీసు శాఖకు గుర్తింపు తీసుకురావడంతో జిల్లా పోలీసు అధికారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ అమర్నాథ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. క్రీడా రంగంలో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన విజయానికి మూలమని ఎస్పీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పతకాలు సాధించి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.అమర్నాథ్ సాధించిన విజయం జిల్లా పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజశేఖర్ రెడ్డి, జార్జ్, ఆర్ఐ రామకృష్ణతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# హాష్ ఆయిల్ కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

- రూ. 2,96,00,000 ల విలువ గల 23.706 లీటర్లు హష్ అయిల్ స్వాధీనం






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 13 (పీపుల్స్ న్యూస్) :** నిషిద్ధ మాదకద్రవ్యం అయిన హాష్ ఆయిల్‌ను కలిగి ఉన్న ఇద్దరు (02) వ్యక్తులను హైదరాబాద్ నగర కమిషనర్ టాస్క్‌ఫోర్స్, జూబ్లీహిల్స్ జోన్ టీమ్ , బోరబండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.హైదరాబాద్ నగర కమిషనర్ టాస్క్‌ఫోర్స్, జూబ్లీహిల్స్ జోన్ టీమ్ , బోరబండ పోలీసులు సంయుక్తంగా జరిపిన తనిఖీలలో అల్లూరి సీతారామరాజు జిల్లా, బోయితెలి పంచాయతీ , దిగరపల్లి గ్రామానికి చెందిన లసంగి యాకోబు అలియాస్ వెంకట్(29 ) , కుమారికుంట గ్రామానికి చెందిన యేంద్రపల్లి సూరి బాబు(32 ) లను పట్టుకుని విచారించగా నిందితుడైన లసంగి యాకోబు ఆర్థిక ఇబ్బందుల కారణంగా, అతను తన చదువును మధ్యలోనే ఆపేసి ఆటో-రిక్షా డ్రైవర్‌గా పనిచేశాడు. ఈ సమయంలో అతనికి యేంద్రపల్లి సూరి బాబుతో పరిచయం ఏర్పడింది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో, వారు గంజాయి, హాష్ ఆయిల్‌ను అక్రమంగా రవాణా , సరఫరా చేయడానికి కుట్ర పన్నారు.యాకోబు గతంలో 2016లో ఒక గంజాయి రవాణా కేసులో పట్టుబడ్డాడు, ఆ కేసులో మడుగుల పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్ చేశారు. జైలు నుండి విడుదలైన తర్వాత, అతను మళ్లీ ఆటో-రిక్షా డ్రైవర్‌గా పనిచేయడం ప్రారంభించాడు. అయినప్పటికీ, నిరంతర ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ తగాదాల కారణంగా, అతను మళ్లీ నిషేధిత వస్తువుల అక్రమ వ్యాపారం వైపు మళ్లాడు. తన అనుచరుడైన యేంద్రపల్లి సూరి బాబుతో కలిసి, యాకోబు నిషేధిత హాష్ ఆయిల్ తయారీ , సరఫరాలో పల్గొనే సంతోష్ , మంజు బాబులతో పరిచయం పెంచుకున్నాడు, వారు తదుపరి పంపిణీ కోసం వీరికి డ్రగ్స్ సరఫరా చేసేవారు.2025 , 2026 సంవత్సరాలలో, యాకోబు , యేంద్రపల్లి సూరి బాబు పలుమార్లు బెంగళూరుకు హాష్ ఆయిల్‌ను సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సెప్టెంబర్ 2025లో, యాకోబు హాష్ ఆయిల్ అక్రమ సరఫరాలో పాలుపంచుకున్నాడు, దీనికి సంబంధించి హైదరాబాద్ సిటీలోని బోరబండ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదైంది ఈ కేసులో అతను పరారీలో ఉన్నాడు.కొన్ని రోజుల క్రితం, తమ అనుచరుల నుండి అందిన సమాచారం మేరకు, యాకోబు , సూరి బాబు ఆంధ్రప్రదేశ్‌లోని కిల్లంకోట సమీపంలో హాష్ ఆయిల్ కన్సైన్‌మెంట్‌ను సేకరించారు. ఈ నిషిద్ధ వస్తువును ఒడిశా నుండి తీసుకువచ్చి సదరు ప్రాంతంలో వీరికి అందజేశారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఉన్న ఒక పెడ్లర్‌కు అందించే ఉద్దేశంతో వారు ఈ హాష్ ఆయిల్‌ను రైలు ద్వారా హైదరాబాద్‌కు రవాణా చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ, మెట్రో పిల్లర్ నంబర్ ూా992 సమీపంలో గల బస్టాప్ వద్ద బెంగళూరు బస్సు ఎక్కడానికి వెళు తుండగా, పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ సమయంలో వారి ఆధీనం నుండి 23.706 లీటర్ల నిషిద్ధ హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.డ్రగ్స్ అనేవి సమాజానికి ఒక పెద్ద ముప్పు, ఇవి కెరీర్‌లను, కుటుంబాలను మరియు భవిష్యత్తును నాశనం చేస్తాయి. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మరియు సులభంగా డబ్బు సంపాదించే ఆలోచనల వైపు లేదా వ్యసనాల వైపు పడకూడదని కమిషనర్ టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ సిటీ బలంగా విజ్ఞప్తి చేస్తోంది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల ఉద్యోగాలు కోల్పోవడం, మానసిక ,శారీరక ఆరోగ్య సమస్యలు , ఒకరి భవిష్యత్తును నాశనం చేసే క్రిమినల్ రికార్డులు వంటి ఘోరమైన పరిణామాలు ఎదురవుతాయి. వారి వద్ద నుంచి రూ. 2,96,00,000 విలువ గల హాష్ ఆయిల్ - 23.706 లీటర్లు, మొబైల్ ఫోన్లు -- 02 స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ప్రజలు అప్రమత్తంగా ఉండాలని , డ్రగ్స్ కు సంబంధించిన ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలైనా వెంటనే పోలీసు అధికారులకు నివేదించాలని కోరుతున్నారు. హైదరాబాద్‌ను డ్రగ్స్ రహిత నగరంగా మార్చడంలో మీ సహకారం ఎంతో కీలకం. మీకు ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ ఆపరేషన్‌ను కమిషనర్ టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పర్యవేక్షణలో నిర్వహించారు. జూబ్లీహిల్స్ జోన్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చ. యదేందర్, సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. రవి రాజ్ , వారి బృందం, బోరబండ పోలీసులతో సమన్వయం చేసుకుని విజయవంతంగా నిర్వహించారు.

# బీఆర్ఎస్ బీఫామ్‌తో గెలిచి.. కాంగ్రెస్ జెండా మోస్తూ నేటికి రెండేళ్లు

- శేరిలింగంపల్లి ప్రజా తీర్పును కాంగ్రెస్ కు తాకట్టు పెట్టిన ఎమ్మెల్యే గాంధీ
- శేరిలింగంపల్లి లో ప్లకార్డులతో బీఆర్ఎస్ శ్రేణుల భారీ నిరసన
- రాజకీయ ద్రోహికి ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదన్న బొబ్బ నవతారెడ్డి









**శేరిలింగంపల్లి, జూలై 13 (పీపుల్స్ న్యూస్) :**
శేరిలింగంపల్లి ప్రజల తీర్పును తాకట్టుపెట్టి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరిన రెండేళ్ల రాజకీయ ద్రోహాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం బి.ఆర్.ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రోడ్లపైకి వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ భారీ నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్‌తో గెలిచి.. కాంగ్రెస్ జెండా మోస్తూ నేటికి రెండేళ్లు అని రాసి ఉన్న పలు ప్లకార్డులను ప్రదర్శిస్తూ, ఎమ్మెల్యే గాంధీ తీరును తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఎమ్మెల్యే గాంధీపై ఘాటు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ఓట్లతో గెలిచి కాంగ్రెస్ గూటికి చేరిన ఆయనొక వలస రాజకీయ పక్షి అని మండిపడ్డారు. ఓటు టీఆర్ఎస్ (బీఆర్ఎస్)కు వేస్తే.. అధికారం కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్‌తో ఎన్నికల్లో గెలిచి సిగ్గులేకుండా కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకున్న రాజకీయ ద్రోహి అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. శేరిలింగంపల్లి ప్రజా తీర్పును తాకట్టు పెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయ్యిందని, ఈ రెండేళ్ల రాజకీయ ద్రోహానికి శేరిలింగంపల్లి ప్రజలు కచ్చితంగా లెక్కలు అడుగుతున్నారని ఆమె డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి లాంటి ఆసియాలోనే అతిపెద్ద ఐటీ కారిడార్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించడం గాలికి వదిలేసి, కేవలం తన వ్యక్తిగత వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకునేందుకే అధికార పార్టీకి అమ్ముడుపోయారని బి ఆర్ ఎస్ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ప్రజల అభివృద్ధి వద్దు.. తన కో.కంపెనీల వ్యాపారాల అభివృద్ధే ఆయనకు ముద్దు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలు, కంపుకొడుతున్న డ్రైనేజీలు, వర్షం వస్తే చెరువులను తలపించే రోడ్లు ఆయనకు పట్టవు. పార్టీలు మారాడు కానీ.. శేరిలింగంపల్లి ప్రజల తలరాతను మాత్రం మార్చలేకపోయాడు. దళారులకు, పైరవీకారులకే ఆయన పెద్దపీట వేస్తున్నారు అని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ , కార్యకర్తలు,మహిళలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము

**- తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్**



**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో జూలై 13 (పీపుల్స్ న్యూస్) :**
నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సొసైటీ అధ్యక్షులు సి.వి. ఆనంద్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై, సొసైటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనుల్లో జరిగిన జాప్యంపై డీజీపీ సి.వి. ఆనంద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిప ^దికన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆయన కఠినంగా ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు వేగానికి కూడా అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని హెచ్చరించారు. దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక విద్యాసంస్థలో పోలీస్ కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ కుటుంబాల పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక మౌలిక వసతులు, ఆధునిక బోధనా విధానాలు, విలువలతో కూడిన విద్య, క్రీడలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన కొనసాగుతోంది.సమావేశంలో పాఠశాల రెండో విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇప్పటివరకు సాధించిన పురోగతిపై డిజిపి సమగ్ర సమీక్ష నిర్వహించారు. 2025--26 విద్యా సంవత్సరంలో 345 మంది విద్యార్థులు నమోదు కాగా, 2026--27 విద్యా సంవత్సరానికి 360 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు అధికారులు వివరించారు. గత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిని ప్రారంభించారు.ప్రస్తుతం నర్సరీ నుంచి ఆరో తరగతి వరకు బోధన కొనసాగుతున్న ఈ పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరంలో మొత్తం 360 మంది విద్యార్థుల్లో 184 మంది పోలీస్ కుటుంబాలకు చెందినవారు, 176 మంది నాన్-పోలీస్ కుటుంబాలకు చెందినవారు ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అందిస్తున్న నాణ్యమైన విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనమని సభ్యులు అభిప్రాయపడ్డారు. పాఠశాల విస్తరణలో భాగంగా నూతనంగా 17 తరగతి గదులతో కూడిన నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణ నమూనాను డిజిపి కి వివరించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకతను పెంపొందించేలా ప్రపంచ స్థాయి విద్యను అందించాలని అన్నారు.విద్యతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు, సురక్షితమైన విద్యా వాతావరణం, ఆధునిక బోధనా పద్ధతులను కల్పించడంతో పాటు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందడంతో పాటు మాదకద్రవ్యాలు వంటి సామాజిక దురలవాట్లకు దూరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పిల్లలు సురక్షిత వాతావరణంలో విద్యనభ్యసిస్తారనే నమ్మకం తల్లిదండ్రుల్లో ఉందని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని డీజీపీ అన్నారు.పాఠశాల పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రొక్యూర్‌మెంట్ కమిటీ, అకాడమిక్ కమిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ, కోఆర్డినేషన్ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. విధివిధానాలను సమావేశంలో ఆమోదించారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా ఈ కమిటీలు పనిచేయనున్నాయి.ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు, విద్యా కార్యక్రమాలు, బోధన విధానాలు, మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై స్కూల్ ప్రిన్సిపల్, సిబ్బంది పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సొసైటీ సభ్యులకు వివరించారు. నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణాన్ని వేగవంతం చేసి, ప్రతి అంశంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని డిజిపి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్ , డీజీ (గ్రేహౌండ్స్ ఆక్టోపస్) డాక్టర్ అనిల్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఐజీ (ప్రొవిజనింగ్ ఎ లాజిస్టిక్స్) గజరావు భూపాల్, ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ కుమార్, ఏఐజీ (లా ఎ ఆర్డర్) రమణ కుమార్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రిన్సిపల్ అనితా రెడ్డి, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ దీప్తి, జీఎం రాజేష్, విశాల్, సాక్షిత్ పాటుసొసైటీసభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు







## 'నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయండి'

**ఖమ్మం రూరల్, జూలై 13 :** ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కార్యదర్శి బొడ్డు మధు అన్నారు. ఖమ్మం మండలంలోని పొన్నెకల్ గ్రామంలో సోమవారం డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు మధు మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా అధికారంలోకొస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు కనీసం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ సమస్యతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే మూసీ నది ప్రక్షాళన, హైడ్రా, ఫుట్ బాల్ అంటూ ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నాడని విమర్శించారు.నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత, నిరుద్యోగులు పార్టీలకు, సంఘాలకు పార్టీలకు భారీ సంఖ్యలో హాజరై ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వెల్పుల ప్రవీణ్, సీనియర్ నాయకులు కత్తం ఉపేందర్, డీవైఎఫ్ఐ నాయకులు పాషా, సాగర్, నరేష్, కిరణ్, రాము, శ్రీను, వెంకట్, కిషోర్, రాజేష్ పాల్గొన్నారు.



## నేటి నక్షత్రాల వన మహోత్సవం విజయవంతం చేయండి చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ



**చేగుంట జూలై 13** చేగుంట మండల కేంద్రంలోని సీఎంఆర్ కాలనీలో శ్రీ హనుమాన్ విగ్రహం దగ్గర 27 రకాల నక్షత్రాల వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం రోజున ఆయన మాట్లాడుతూ మంగళవారం అమావాస్య రోజున చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు 27 నక్షత్రాలకు సంబంధించిన వివిధ రకాల మొక్కలు నాటుతున్నట్లు వేద పండితులతో ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథులచే ప్రారంభమవుతుందని కావున ప్రతి ఒక్కరూ వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## అమీన్‌పూర్‌లో విషాదం.. అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి





**అమీన్‌పూర్, జూలై 13:(** సైబరాబాద్: అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఒక ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆనంద్‌నగర్--అమీన్‌పూర్ ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

**ఘటన వివరాలు:**
మృతుడిని మొహమ్మద్ రియాజ్ (స్థానికుడు)గా పోలీసులు గుర్తించారు. ఈయన ఆనంద్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారని, స్థానికంగా ఉన్న ఒక ఫ్రూట్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిసింది.

**పోలీసుల దర్యాప్తు:**
సమాచారం అందుకున్న వెంటనే అమీన్‌పూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, క్లూస్ టీమ్స్ సహాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.రియాజ్ మృతి వెనుక ఉన్న కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టారు. ఇది హత్యనా? లేక ప్రమాదవశాత్తూ జరిగిన మరణమా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం పోస్టుమార్టం నివేదిక కోసం పోలీసులు వేచి చూస్తున్నారు. రిపోర్టు వచ్చిన తర్వాతే మృతికి గల పూర్తి కారణాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నపోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

## నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

**- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**- ఆరు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిల పంపిణీ**



**పటాన్‌చెరు, జూలై 13:**
ఆపద కాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ ఎస్ఎస్ఎల్ కాలనీకి చెందిన పుష్పలత, ప్రగ్య శ్రీ తల్లి కూతుర్లు, ప్రగ్యశ్రీ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. శస్త్ర చికిత్స తదనంతర ఖర్చుల నిమిత్తం మంజూరైన ఆరు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని సోమవారం సాయంత్రం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసి లతోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంగళవారం, జూలై 14, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 8

### ఒక సర్వే నంబర్ మీటర్..

# మరో సర్వే నంబర్‌లో ఎలా..?

## సర్వే నంబర్ల గారడీ.. ప్రభుత్వ భూమికి ఎసరు..!

## అడ్డదారుల్లో అధికారులు..? ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం..!






**శేర్లింగంపల్లి : జూలై 13 (పీపుల్స్ న్యూస్)**
భావితరాలకు ప్రభుత్వ భూములను పరిరక్షించి అప్పగించాల్సిన అధికారులే కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్‌లో వెలుగులోకి వచ్చిన క్లారియన్ హోటల్ వ్యవహారం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, సర్వే నంబర్ 111లో ఓ వ్యక్తికి సుమారు 1,250 గజాల ప్రైవేటు భూమి ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే దీనికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 108, 110లో సుమారు 3,751 గజాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రభుత్వ భూమిపై కన్నేసిన సదరు వ్యక్తి, కొందరు అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా చూపించి అందులో ఓ భారీ కట్టడం నిర్మించారు. సర్వే నంబర్లు వేర్వేరుగా ఉన్నప్పటికీ, కొలతలు, సరిహద్దులు, రికార్డుల విషయంలో అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించేందుకు సైతం అడుగులు వేశారు. ఈ వ్యవహారం కారణంగా ప్రభుత్వానికి కోట్ల రూపాయల విలువైన భూమి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో రెవెన్యూ, సర్వే, టౌన్ ప్లానింగ్ శాఖల రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు సహకరించిన అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

**కరెంట్ మీటర్ ఒకచోట... కనెక్షన్ మరోచోట...**
**అక్రమ నిర్మాణాలకు విద్యుత్ ఎలా?**

అక్రమ నిర్మాణాలకు విద్యుత్, తాగునీటి కనెక్షన్లు ఎలా మంజూరవుతున్నాయనే అంశంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రాంతానికి మంజూరైన విద్యుత్ మీటర్‌ను మరో ప్రాంతంలోని అక్రమ నిర్మాణానికి ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో విద్యుత్ మీటర్ కోసం వేల రూపాయలు కబ్జా రాయుళ్లు ఖర్చు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, సంబంధిత అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ వాటర్ కనెక్షన్ కూడా తీసుకున్నట్లు సమాచారం. దీంతో సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి పరిశీలన లేకుండానే విద్యుత్, నీటి కనెక్షన్లు మంజూరు చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారికి విద్యుత్, నీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఆక్రమణలకు పరోక్షంగా ప్రోత్సాహం లభిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరిగితే సంబంధిత శాఖలు వెంటనే స్పందించి, విద్యుత్ కనెక్షన్, నీటి కనెక్షన్, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ వంటి అనుమతులు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ శాఖ సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా కనెక్షన్లు మంజూరు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఆర్మ్డ్ రిజర్వ్‌కు కేటాయించిన స్థలాన్నీ వదలని కబ్జాదారులు..! 60 గజాల ప్రభుత్వ స్థలం రూ.15 లక్షలకు విక్రయం చేస్తున్నారనే ఆరోపణలు..!



## మోసపోయి గోసపడుతున్న పేదలు..

# 307లో కబ్జాల పర్వం..!


కుత్బుల్లాపూర్ : జూలై 13 (పీపుల్స్ న్యూస్)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్వే నంబర్ 307లో ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వానికి చెందిన స్థలాన్ని కొందరు కబ్జాదారులు ప్లాట్లుగా విభజించి, ఒక్కో 60 గజాల స్థలాన్ని సుమారు రూ.15 లక్షలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేద ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి ప్రభుత్వ స్థలాలను వారికి కట్టబెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కబ్జా రాయుళ్ల దగ్గర నుండి స్థలాలు కొనడం పేదలకు వారు మోసపోయినట్లు అర్థమైందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ స్థలాలను కొనుగోలు చేసి చివరకు మోసపోయి గోసపడుతున్న పరిస్థితి నెలకొంది. గతంలో అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఈ భూమిలో కొంత భాగాన్ని కేంద్ర బలగాల వినియోగం కోసం కేటాయించినట్లు అధికారులు ప్రకటించారు. అయినప్పటికీ, అదే ప్రాంతంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు, ప్లాట్ల విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ భూములపై ఎలాంటి హక్కులు లేకపోయినా కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు లేదా తప్పుడు హామీలతో అమాయక ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జీవితాంతం కూడబెట్టిన సొమ్ము పెట్టి స్థలం కొనుగోలు చేసిన కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి.ఈ వ్యవహారంపై రెవెన్యూ, హైడ్రా, పోలీసు మరియు సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, మోసపూరితంగా ప్లాట్లు విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అమాయక ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.



**కేంద్ర బలగాల కోసం కేటాయించిన భూమిపై కబ్జా?**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం పరిధి సర్వే నంబర్ 307లో కేంద్ర బలగాల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కొందరు అక్రమార్కులు ఆక్రమించి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.స్థానికుల సమాచారం ప్రకారం, ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన ఈ భూమిలో కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టి, వాటిని విక్రయించడం లేదా అద్దెకు ఇవ్వడం ద్వారా భారీగా లాభాలు పొందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ, మళ్లీ అదే ప్రాంతంలో నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర బలగాల అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమి రక్షణలో సంబంధిత శాఖలు ఎందుకు విఫలమయ్యాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.





మంగళవారం, జూలై 14, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# నంద్యాలలో ఘనంగా గంగమ్మకు బోనాలు సమర్పించిన రజకులు







**నంద్యాల, జూలై 13:** నంద్యాల పట్టణంలోని కుందూ నది ఒడ్డున వెలసిన శ్రీ శ్రీ గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆదివారం జరిగిన ఈ బోనాల ఉత్సవంలో దాదాపు 200 కుటుంబాలు పాల్గొని బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా ఉందన్నారు రాష్ట్రంలో వర్షాలు బాగా కురిసి ఒకపక్క రైతులు మరోపక్క రజకులు సంతోషంగా ఉండాలని గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి ఆలయ ప్రెసిడెంట్ వై నాగభూషణం వైస్ ప్రెసిడెంట్ లింగమూర్తి దాసగిరి నాగరాజు ట్రెజరర్ టి శ్రీనివాసులు సెక్రెటరీ దాసగిరి మునయ్య కమిటీ మెంబర్లు శ్రీనివాసులు ఎన్ సంజప్ప డి రామకృష్ణ వై నాగలింగరాజు గొందిపల్లి శ్రీనివాసులు భారత్ మటన్ చికెన్ సెంటర్ శ్రీనివాసులు రాయలసీమ ప్రతిభ ఎడిటర్ బొల్లవరం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో రూ. 50 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ పనులకు భూమి పూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల, జూలై 13 :** నంద్యాల పట్టణ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఈ క్రమంలో, నంద్యాల పట్టణంలోని పలు వార్డుల్లో నూతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం భూమి పూజ కార్యక్రమం



నిర్వహించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నంద్యాల ఒకటో వార్డు పరిధిలోని పివి నగర్ నందు ఉన్న స్వర్గధామం సమీపంలో మరియు 21వ వార్డులో నూతన డ్రైనేజీల నిర్మాణానికి సుమారు రూ. 50 లక్షల రూపాయల నిధులను కేటాయించారు. భూమి పూజ అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ మరియు పట్టణ పరిశుభ్రత దృష్ట్యా ఈ డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, మధుసూదన్ , పిచికే సుమలత, పబ్బతి వేణు, గురు ప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నంద్యాల నవ నిర్మాణ సమితి ప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ని కలిసిన నంద్యాల నూతన ట్రాఫిక్ సీఐ సుబ్రహ్మణ్యం



**నంద్యాల, జూలై 13 :** నంద్యాల నూతన ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.జే. సుబ్రహ్మణ్యం సోమవారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ సీఐ సుబ్రహ్మణ్యం ని మంత్రి ఫరూక్ అభినందించారు. నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో మరియు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థను అమలు చేయడంలో సుబ్రహ్మణ్యం సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు.

# నంద్యాలలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల, జూలై 13 :**నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ నందు ఈరోజు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల మహా శిబిరం ఘనంగా ప్రారంభమైంది. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. బసవతా రకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారం తో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సుమారు రూ. 15,000 విలువైన క్యాన్సర్ పరీక్షలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు . ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను జయిద్దాం అనే నినాదంతో, క్యాన్సర్‌ను



ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారని తెలిపారు . 30 ఏళ్లు పైబడిన మహిళలు, అలవాట్లు ఉన్నవారు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు మరియు అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారు ఈ సంచార క్యాన్సర్ స్క్రీనింగ్ వాహన సదుపాయాన్ని వినియోగించుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు.



క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని, నయం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, సెంట్రల్ ఫుడ్ కమిషన్ నెంబర్ విశ్వనాథ్ రెడ్డి , సీమ కృష్ణ , రమణారెడ్డి, వసుంధర దేవి, పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యులు, మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్స్ కప్ 2026 పోస్టర్లను విడుదల చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్




**నంద్యాల, జూలై 13:** క్రీడల అభివృద్ధికి మరియు రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్స్ కప్ 2026 పోస్టర్లను నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు మరియు ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ఈ ఛాంపియన్స్ కప్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు . నియోజకవర్గ, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలలో మొత్తం 12 రకాల క్రీడలలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా మరియు బాక్సింగ్ (మొత్తం 12). అండర్-17 మరియు అండర్-23 (బాలురు మరియు బాలికలు) జూలై 15 నుండి ఆగస్టు 26, 2026 వరకు జరుగుతాయని తెలిపారు మొత్తం బహుమతిగా రూ. 91,90,000/- (పోటీలలో విజేతగా నిలిచిన అందరికీ కలిపి) ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ రాజు, ఫినిషింగ్ కోచ్ లక్ష్మణ్, హాకీ కోచ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్ర నుంచి జూలై 16న 1.5 టీఎంసీల నీటి విడుదల

### త్రాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత..నీటి చౌర్యాన్ని అడ్డుకోవాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

**కర్నూలు జూలై 13 :**తుంగభద్ర ప్రాజెక్టు నుంచి జూలై 16న 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. ఈ నీరు 123 కిలోమీటర్లు ప్రయాణించి జిల్లాకు చేరేందుకు సుమారు ఐదు రోజులు పడుతుందని వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నీటి సరఫరా, పంట బీమా అంశాలపై సమీక్షించారు. తుంగభద్ర నీటితో ఎస్ఎస్ ట్యాంకులను నింపేందుకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల తాగునీటి అవసరాలే మొదటి లక్ష్యమని స్పష్టం చేశారు. ట్యాంకుల నుంచి అక్రమంగా నీటిని తరలించకుండా రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్ అధికారులు సమన్వయంతో




పనిచేసి నీటి చౌర్యాన్ని అరికట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున పంటలకు నీటి సరఫరా కష్టంగా ఉందన్నారు. అనావృష్టి పరిస్థితుల్లో రైతులకు పంట బీమా ఆర్థిక రక్షణ కల్పిస్తుందని కలెక్టర్ తెలిపారు. పత్తి, వేరుశనగ పంటలకు బీమా ప్రీమియం చెల్లింపునకు జూలై 15 చివరి తేదీ అని పేర్కొన్నారు. రైతులు స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియంలు చెల్లించేలా



అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పరి, కృష్ణగిరి, ఆలూరు ప్రాంతాల్లో నాన్‌లోనీ రైతులు ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, వీఆర్ఓలు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, బ్యాంకర్లు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎల్‌డీఎం పి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో దివ్యాంగులకు ఉచిత హీరో మోటార్ సైకిళ్ల పంపిణీ

### - దివ్యాంగుల సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల, జూలై 13:** నంద్యాల పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగుల లబ్ధిదారులకు ఉచితంగా హీరో మోటార్ సైకిళ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, ఆత్మగౌరవం, స్వావలంబనకు కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6,000 సామాజిక భద్రతా పెన్షన్, మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు రూ.15,000 పెన్షన్ అందజేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దివ్యాంగులు, బెడ్-రిడెన్ బాధితులకు ఈ స్థాయిలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. అలాగే, పెన్షన్‌లతో పాటు ఉచిత మోటార్ సైకిళ్లు, ఉపకరణాలు, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల ద్వారా దివ్యాంగులను అన్ని రంగాల్లో సాధికారత వైపు నడిపించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దేవరపాటి రవికుమార్, మిద్దె ఉసేని, బాలస్వామి, ఖాజా శంకర్ , వేద సాయి, హారున్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో పారిశ్రామిక ప్రగతి పరుగులు

### 15న దాల్మియా సిమెంట్ రెండో ప్లాంట్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన

### టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి వెల్లడి

**కడప జూలై 13 :**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి తెలిపారు. మంత్రి నారా లోకేష్ రెండు రోజుల జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో సోమవారం కడపలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 15న మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా దాల్మియా సిమెంట్ కర్మాగారం రెండో ప్లాంట్‌కు శంకుస్థాపన జరగనుందని తెలిపారు. రూ.3,100 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా అభివృద్ధి కుంటుపడిందని భూపేష్ రెడ్డి విమర్శించారు. బ్రాహ్మణి స్టీల్ స్థానంలో ఉక్కు




కర్మాగారం పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. జేఎస్‌డబ్ల్యూ ఉక్కు కర్మాగార పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించడం, కొప్పర్తి పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కొప్పర్తిలో షిర్డీ సాయి కంపెనీకి సుమారు 450 ఎకరాలు కేటాయించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ పర్యటన వివరాలను వెల్లడిస్తూ.. ఈ నెల 14న సాయంత్రం కడప విమానాశ్రయానికి చేరుకుని మైలవరం మండలం కర్మలవారిపల్లెలో బస చేస్తారని తెలిపారు. 15న ఉదయం దాల్మియా ప్లాంట్‌కు శంకుస్థాపన అనంతరం ప్రొద్దుటూరులో టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొని సాయంత్రం అమరావతికి బయలుదేరుతారని వివరించారు. ఈ సమావేశంలో ముని శేఖర్ రెడ్డి, జబివుల్లా, డా. నజిముద్దీన్, అక్బర్, జనార్దన్, మన్సూర్ అలీఖాన్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# అభిషేక్ శర్మ ఖాతాలో విచిత్రమైన రికార్డు..!



సౌతాంప్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఆఖరి ఐదో టీ20 మ్యాచ్ టీమిండియాకు ఏమాత్రం కలిసిరాలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం పాలై సిరీస్‌ను చేజార్చుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచులో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఓ అరుదైన రికార్డు సాధించాడు. సౌతాంప్టన్ మ్యాచులో అభిషేక్ శర్మ ఒక విచిత్రమైన, ఎవరూ ఊహించని అంతర్జాతీయ క్రికెట్ మైలురాయిని అందుకొని రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. అభిషేక్ శర్మ.. వన్డే లేదా టెస్ట్ ఫార్మాట్ ఆడకుండా.. అత్యధిక టీ20 మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా నిలిచాడు. శనివారం భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన ఐదో టీ20 మ్యాచులో అతడు ఈ ఫీట్ సాధించాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. టీమిండియా తరపున ఇప్పటివరకు 53 టీ20 మ్యాచులు ఆడాడు. ఈ క్రమంలోనే వెస్టిండీస్ మాజీ స్పిన్నర్ శామ్యూల్ బద్రీని అధిగమించాడు. అతడు గతంలో టెస్ట్ లేదా వన్డే ఫార్మాట్ ఆడకుండా జాతీయ జట్టు తరపున అత్యధికంగా 52 టీ20లు ఆడాడు. కాగా ఇటీవల భారత జట్టు టీ20 క్రికెట్‌లో పేలవ ప్రదర్శన చేస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో వరుసగా వైట్ వాష్‌కు గురైంది. దీంతో 1601 రోజుల తర్వాత ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ టైటిల్స్ సాధించిన టీమిండియా.. ఇలాంటి ఫలితాలు అందుకోవడం పట్ల క్రీడా విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు సిరీస్‌లలోనూ అభిషేక్ శర్మ మోస్తరు ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌లో ఐదో టీ20లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఈ మ్యాచులో టీమిండియా చిత్తుగా ఓడిపోయింది.

# చిరస్మరణీయ విజయం

**• లార్డ్స్ టెస్టులో టీమిండియా చారిత్రాత్మక గెలుపు • ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించిన భారత్ • రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాటర్ల జోరు**




టీమ్‌ఇండియా మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో హర్మన్‌సేన 270 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. క్రికెట్‌కు పుట్టినిల్లుగా భావించే లార్డ్స్ మైదానంలో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం భారత మహిళ క్రికెట్‌లో ఇది చరిత్రాత్మకం. రెండో ఇన్నింగ్స్‌లో 457 పరుగుల భారీ టార్గెట్ ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలి, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ తలో 2 వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఆట ప్రారంభమైంది. అయితే మునుపటి రోజు జోరును కొనసాగించిన టీమ్‌ఇండియా అమ్మాయిలు అదే జోష్‌లో టపటపా వికెట్లు పడగొట్టారు. దీంతో ఇంగ్లాండ్ ఓవర్‌నైట్ స్కోరుకు 56 పరుగులో జోడించి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. క్రీజులో కుదురుకొని హాఫ్ సెంచరీ సాధించిన అమీ జోన్స్ (54)ను స్నేహ్ రాణా ఔట్ చేసి మళ్లీ వికెట్ల వేట మొదలు పెట్టింది. ఆ తర్వాత 33 బంతులు ఎదుర్కొని ఒకే ఒక్క పరుగు చేసిన ఇస్సీ వాంగ్‌ను దీప్తి శర్మ క్లీన్ బౌల్డ్ చేసింది. ఆ తర్వాత కాసేపటికే లారెన్ (0)ను కూడా దీప్తినే వెనక్కి పంపింది. అయితే చివర్లో ఎకిల్‌స్టోన్ (50) కాసేపు నిలదొక్కుకోవడంతో భారత్ విజయం కాస్త ఆలస్యం అయ్యింది. చివరికి ఆమెను స్నేహ్ రాణా ఔట్ చేసి భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అందించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్, ఇంగ్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును పరిగెత్తించింది. మూడో రోజు ఆటలో ఇంగ్లాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లు ముగిసే సరికి 100/5తో నిలిచింది. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 357 పరుగులు అవసరం కాగా.. భారత్ మరో ఐదు వికెట్లు సాధిస్తే చరిత్రాత్మక విజయం సాధిస్తుంది. ఓవర్ నైట్ స్కోరు 154/1తో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్ కాసేపటికే వికెట్ కోల్పోయింది. జట్టు స్కోరు 161 వద్ద స్మృతి మంధాన 70 రన్స్ చేసి ఔట్ అయింది. అయితే యస్తికా భాటియా మాత్రం అదరగొట్టింది. లార్డ్స్‌లో శతక్కొట్టి.. టెస్ట్ క్రికెట్‌లో ఇక్కడ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. 113 పరుగులు చేసిన అనంతరం ఆమె పెవిలియన్ చేరింది. ఆమె ఔట్ అయిన తర్వాత టీమిండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో రిచా ఘోష్ 50 రన్స్ నాటౌట్‌తో భారత్ భారీ స్కోరు చేసింది. 341/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇంగ్లాండ్ ముందు 457 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయినప్పటికీ భారత్ తొలి రోజు నుంచే పూర్తిగా ఆధిపత్యం చలాయించింది. ఏ దశలోనూ ఇంగ్లాండ్ విజయం దిశగా సాగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83 పరుగులు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (58 పరుగులు), దీప్తి శర్మ (57 పరుగులు) ముగ్గురూ హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారత్ పోరాడగలిగే 285 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత తొలి బౌలింగ్‌లోనూ అదే సత్తా చాటుతూ ప్రత్యర్థిని 170 రన్స్‌కే ఆలౌట్ చేసింది. టీమ్‌ఇండియా ప్లేయర్లు క్రాంతి గౌడ్, యస్తికా భాటియా తమతమ కెరీర్‌లో అరుదైన ఘనత సాధించారు. రెండో రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లతో సత్తా చాటి ఇంగ్లాండ్ పతనాన్ని శాసించిన క్రాంతి గౌడ్ తన పేరును లార్డ్స్ ఆనర్స్ బోర్డులో లిఖించుకుంది. దీంతో ఈ గౌరవం అందుకున్న తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సాధించింది. అంతకుముందు ఏ మహిళా ప్లేయర్‌కు కూడా ఈ గౌరవం దక్కలేదు. ఆ తర్వాత మూడో రోజు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ యస్తికా భాటియా శతకం బాదేసింది. వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన భాటియా 158 బంతులు ఎదుర్కొని 113 పరుగులు చేసింది. ఇందులో 14 ఫోర్లు ఉన్నాయి. దీంతో లార్డ్స్ మైదానంలో టెస్ట్ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా యస్తికా భాటియా చరిత్ర సృష్టించింది. ఫలితంగా ఆమె పేరు కూడా అక్కడి ప్రఖ్యాత 'ఆనర్స్ బోర్డు'పై కెక్కింది. ఇది భారత క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయంగా చెప్పవచ్చు. అయితే భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీలాంటి బ్యాటర్లకు సైతం లార్డ్స్‌లో సెంచరీ సాధించడం సాధ్యం కాలేదు. అలాంటిది 26ఏళ్ల యస్తిక ఈ ఘనత అందుకుంది. ఇక లార్డ్స్‌లో శతకం బాదిన భారత 11వ క్రికెటర్‌గానూ నిలిచింది. వినూ మన్కడ్, దిలీప్ వెంగ్‌సర్కార్, గుండప్ప విశ్వనాథ్, రవిశాస్త్రి, మహ్మద్ అజారుద్దీన్, సౌరభ్ గంగూలీ, అజిత్ అగార్కర్, రాహుల్ ద్రవిడ్, కేఎల్ రాహుల్ అజింక్యా రహానే లార్డ్స్‌లో టెస్టు సెంచరీలు చేశారు. సంక్షిప్త స్కోర్లు: భారత్: తొలి ఇన్నింగ్స్ - 285/10 రెండో ఇన్నింగ్స్ - 347/7 (డిక్లేర్డ్) ఇంగ్లాండ్: తొలి ఇన్నింగ్స్ - 170/ 10 రెండో ఇన్నింగ్స్ - 186 / 10

# హెడ్ కోచ్ పదవికి మెక్‌కల్లమ్ రాజీనామా..!



ఇంగ్లాండ్ ప్రధాన కోచ్ పదవికి బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామా చేశాడు. ఇటీవల జట్టు చెత్త ప్రదర్శనతో విమర్శల పాలైన మెక్‌కల్లమ్ ఆదివారం (జులై 12, 2026) తాను కోచ్‌గా వైదొలుగుతున్నట్టు అధికారికంగా ప్రకటించాడు. 2022 నుంచి బెన్ స్టోక్స్‌తో కలిసి 'బజ్ బాల్' క్రికెట్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన అతడు.. తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నాడు. బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజుల వ్యవధిలోనే మెక్ కల్లమ్ .. తప్పుకోవడం గమనార్హం. మెక్‌కల్లమ్ నిష్క్రమణ బాజ్ బాల్ శకానికి ముగింపు పలికినట్లయింది. మెక్‌కల్లమ్ 2022 నుంచి ఇంగ్లాండ్ టెస్ట్ కోచ్‌గా ఉన్నాడు. 2025లో వైట్-బాల్ జట్లకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. "టెస్ట్ జట్టుకు కోచింగ్ ఇవ్వడం అంటే నాకు చాలా ఇష్టం. మేం కలిసి సాధించిన వాటిపై గర్వపడుతున్నా. ఈ కాలంలో ఎన్నో నమ్మశక్యంకాని విజయాలు, అదే సమయంలో కఠిన ఫలితాలు చూశాం. కానీ ఇదంతా ఆటలో భాగమే. టెస్ట్ జట్టుకు హెడ్ కోచ్ పదవిని అదృష్టం, గౌరవంగా భావిస్తున్నా. నా ఈ ప్రయాణంలో మాకు మద్దతు ఇచ్చిన ఆటగాళ్లు, సిబ్బంది, అభిమానులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నా దృష్టి వైట్ బాల్ జట్లకు కోచింగ్ ఇవ్వడంపై ఉంటుంది" అని మెక్ కల్లమ్ తన ప్రకటనలో పేర్కొన్నాడు. 2022లో ఇంగ్లాండ్ టెస్ట్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్.. అప్పటి కెప్టెన్ బెన్ స్టోక్స్‌తో కలిసి దూకుడైన ఆటకు శ్రీకారం చుట్టాడు. దీనికే 'బజ్‌బాల్' అని పేరొచ్చింది. ప్రారంభంలో బజ్ బాల్ మెరుగైన ఫలితాలు ఇచ్చింది. న్యూజిలాండ్ (3-0), దక్షిణాఫ్రికా (2-1)తో సిరీస్‌లు గెలుచుకుంది. పాకిస్థాన్‌పై 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. కానీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో మాత్రం ఇప్పటివరకు ఫైనల్ చేరలేకపోయింది. ఇంగ్లాండ్ 2021-23 సైకిల్‌లో నాలుగో స్థానంలో, 2023-25 సైకిల్‌లో ఐదో ప్లేసులో నిలిచింది. ప్రస్తుతం 2025-27 స్టాండింగ్స్‌లో ఏడవ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ ఇటీవల టెస్టుల్లో పేలవ ఫలితాలు అందుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియాలో ఇంగ్లాండ్ 4-1తో యాషెస్‌లో పరాజయం పాలైంది. గత నెలలో న్యూజిలాండ్ చేతిలో 2-1 తేడాతో స్వదేశంలో టెస్టు సిరీస్ ఓడిపోయింది.

# చెన్నై హెడ్ కోచ్ పదవికి ఫ్లెమింగ్ రాజీనామా..



**కొత్త కోచ్ రేసులో హేమంగ్ బదానీ, ద్రవిడ్**

ఐపీఎల్ చరిత్రలోనే విజయవంతమైన కోచ్‌ల్లో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్ చెన్నై సూపర్ కింగ్స్ తో తన అనుబంధాన్ని ముగించారు. ఏకంగా 18 ఏళ్లపాటు సీఎస్కేతో కలిసి పని చేసిన ఆయన చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. తాము, ఫ్లెమింగ్ ఉమ్మడిగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెన్నై సూపర్ కింగ్స్ సోమవారం ప్రకటించింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం సంధి దశలో ఉంది. సీఎస్కేకు క్రేజ్ తీసుకొచ్చిన ధోనీ కెరీర్ చరమాంకంలో ఉంది. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. గత మూడు సీజన్లలో చెన్నై ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. 2024, 2025, 2026 సీజన్లలో లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. చెన్నై సూపర్ కింగ్స్ సిస్టర్ ఫ్రాంచైజీ అయిన టెక్సాస్ సూపర్ కింగ్స్ సైతం ఈ ఏడాది మేజర్ లీగ్ క్రికెట్‌లో చివరి స్థానానికి పరిమితమైంది. ఈ జట్టు బాధ్యతలను కూడా ఫ్లెమింగ్ పర్యవేక్షించేవారు. ఫ్రాంచైజీకి చెందిన జట్లు వరుసగా విఫలం అవుతున్న నేపథ్యంలో ఫ్లెమింగ్‌తో అనుబంధాన్ని సూపర్ కింగ్స్ తెంచుకుందని భావిస్తున్నారు. ఐపీఎల్‌తోపాటు అమెరికా, సౌతాఫ్రికాల్లోని సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీల బాధ్యతల నుంచి కూడా ఫ్లెమింగ్ తప్పుకున్నారు. 2008లో ఐపీఎల్ తొలి సీజన్లో ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్‌తో అనుబంధాన్ని మొదలుపెట్టిన ఫ్లెమింగ్.. 2009 సీజన్లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. 2026 సీజన్ ముగిసే వరకు ఆయన సీఎస్కే ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 17 ఏళ్లకుపైగా చెన్నై హెడ్ కోచ్‌గా వ్యవహరించిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్.. బలమైన ఆధునిక క్రికెట్ సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు ఐపీఎల్ టైటిల్స్ సాధించడంతోపాటు రెండు ఛాంపియన్స్ లీగ్ టైటిళ్లు గెలుపొందింది. 12సార్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన సీఎస్కే పదిసార్లు ఫైనల్‌కు చేరుకుంది. కోచ్ ఫ్లెమింగ్, కెప్టెన్ ధోనీ మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయి. వీరిద్దరికీ మేనేజ్‌మెంట్ పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ స్థాయిలో విజయాలు సాధించగలిగింది. ఫ్రాంచైజీ క్రికెట్లో ఆటగాళ్లు, సహాయక సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. కానీ ధోనీ, ఫ్లెమింగ్ కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరిద్దరూ ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవిస్తూ.. తమ పరిధులను అర్థం చేసుకుంటూ.. ప్రశాంతంగా పని చేసుకొని పోయేవారు. ఒకరిపై మరొకరికి అపారమైన నమ్మకం ఉండేది. సీఎస్కే తరఫున ఆడిన చాలా మంది ఆటగాళు అక్కడి డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం గురించి ఇప్పటికీ గొప్పగా చెబుతుంటారు. "పద్దెనిమిదేళ్లు అనేది స్పోర్ట్స్‌లో లైఫ్ టైమ్, పూర్తి కృతజ్ఞతా భావంతో నేను వీడ్కోలు పలుకుతున్నా. సీఎస్కేతో నేను గడిపిన కాలం నా కోచింగ్ కెరీర్లోనే ఎంతో గొప్పది. మనం సాధించిన ప్రతి దానికీ నేను గర్విస్తున్నాను. మనం ఎన్నో మర్చిపోలేని విజయాలను ఆస్వాదించాం, ఎన్నో క్లిష్ట పరిస్థితులను అధిగమించాం. జీవితాంతం నాతో నిలిచిపోయే జ్ఞాపకాలను సంపాదించుకున్నాను" అని చెన్నై హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న సందర్భంగా స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యాఖ్యానించారు. ఫ్లెమింగ్ హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్న వేళ సీఎస్కే ఫ్రాంచైజీ యజమాని రూపా గురునాథ్, మేనేజింగ్ డైరెక్టర్ కాశీ విశ్వనాథ్ ఆయనపై ప్రశంసలు గుప్పించారు. ఎలా ఆడాం అనేదే కాకుండా ఓ ఫ్రాంచైజీగా ఎలాంటి స్థానానికి చేరుకోవాలనుకున్నామో నిర్దేశించడంలో ఫ్లెమింగ్ ఎంతో తోడ్పాటును అందించారని కాశీ విశ్వనాథ్ తెలిపారు. నిలకడ, అణకువ, జట్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వడం అనే విలువలపై ఆధారపడిన ఓ గొప్ప సంస్కృతిని ఫ్లెమింగ్ నిర్మించారంటూ సీఎస్కే ఎండీ కొనియాడారు.

## 24న సందడి చేయనున్న 'జన నాయగన్'

### ఓవర్‌సీస్‌లో అన్‌కట్ వర్షన్ విడుదల



ఏడు నెలల నిరీక్షణకు చెక్ పెడుతూ.. 'జన నాయగన్' జులై 24న సందడి చేయనుంది. విజయ్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. బోర్డు చెప్పిన మార్పులను చేసి చిత్రబృందం దీన్ని విడుదల చేసేందుకు సిద్ధమైంది. అయితే ఓవర్సీస్‌లో మాత్రం ఈ సినిమా అన్‌కట్ వెర్షన్ విడుదల కానుంది. భారత్‌లో పలు కట్స్ విధించినప్పటికీ, యూకే లో మాత్రం ఈ చిత్రం ఎలాంటి కట్స్ లేకుండా ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్కడ ఈ సినిమాను ఎలాంటి మార్పుల్లేకుండానే విడుదల చేసేందుకు అనుమతి లభించింది. ఇక విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి కావడంతో సినిమా టైటిల్ కార్డులోనూ మార్పు చేశారు. గతంలో దళపతి విజయ్ అనే టైటిల్ కార్డు.. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌గా మారనుంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు 12 మార్పులు సూచించి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను తొలగించడంతో పాటు కొన్ని పదాలను మ్యూట్ చేయాలని.. మరికొన్ని సన్నివేశాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో త్వరలోనే

# మళ్లీ బిజీగా మారిన నటి లయ

### వదలను సినిమా 17న విడుదల



అందాల నటి లయ 'భద్రం కొడుకో' చిత్రంతో బాలనటిగా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 'స్వయంవరం'తో హీరోయిన్ గా ఎదిగింది. ఫస్ట్ ఇన్నింగ్స్ లో పలు అర్థవంతమైన చిత్రాలలో నటించిన లయ... ఉత్తమ నటిగా నంది అవార్డులు అందుకుంది. అయితే ఆ తర్వాత వివాహానంతరం అమెరికాకు వెళ్ళిపోవడంతో కొన్నేళ్ళు నటనకు దూరంగా ఉంది. ఆ మధ్య రవితేజ 'అమర్ అక్బర్ ఆంథోని' మూవీలో తన కూతురుతో కలిసి మెరుపులా మెరిసన లయ... గత యేడాది 'తమ్ముడు' సినిమాతో రీ-ఎంట్రీ ఇచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఆ సినిమా లయ అక్కగా నటించింది. కానీ ఆ సినిమా నిరాశ పర్చింది. ఆ తర్వాత తనకు బాగా కలిసి వచ్చిన శివాజీ సరసన లయ 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' చిత్రంలో నాయికగా నటించింది. కానీ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేదు. గతంలో జగపతిబాబు సరసన 'మనోహరం'లో నటించి మంచి పేరు తెచ్చుకున్న లయ ఇప్పుడు మరోసారి ఆయనతోనే 'వదలా' చిత్రంలో చేస్తోంది. హృతికా శ్రీనివాస్ కీలక పాత్ర పోషించిన 'వదలా' హారర్ నేపథ్యంలో తెరకెక్కిన ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాను ఆకెళ్ళ వి కృష్ణ తెరకెక్కించాడు. మూడు వారాల క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమాకు మరింత మెరుగులద్ది జూలై 17న విడుదల చేస్తున్నట్టు జగపతి బాబు తెలిపారు. విశేషం ఏమంటే... గతంలో శ్రీకాంత్ సరసన పలు చిత్రాలలో నటించిన లయ ఇప్పుడు 'మిస్టర్ మిడిల్ క్లాస్'మూవీలో హీరోయిన్ గా నటించింది. ఇందులో రాజేంద్ర ప్రసాద్ వేంకటేశ్వర స్వామిగా నటిస్తున్నారు. ఈ సోషియో ఫాంటసీ మూవీని జి. నాగేశ్వరరెడ్డి డైరెక్ట్ చేశారు. ఈ సినిమా కూడా జూలై 17నే రాబోతోంది. ఇలా సెకండ్ ఇన్నింగ్స్‌లో లయ హీరోయిన్ గా నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం కాకతాళీయం.ఇదే విషయాన్ని 'వదలా' చిత్ర నిర్మాతల్లో ఒకరైన తమ్మారెడ్డి భరద్వాజ దగ్గర ప్రస్తావించినప్పుడు ఆయన చాలా స్పోర్టివ్‌గా ఈ అంశాన్ని తీసుకున్నారు. 'ప్రతి వారం ఐదారు సినిమాలు వస్తూనే ఉంటాయి. అందులో బాగున్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. లయ నటించిన రెండు సినిమాలు ఒకే రోజు రావడం తప్పేమీ కాదు. నిర్మాతలం ఎవరి వీలును బట్టి వాళ్ళం సినిమాలు రిలీజ్ చేస్తుంటాం. ఏ సినిమా బాగుంటే అది ఆడుతుంది... అంతే!' అని అన్నారు. ఈ వీకెండ్‌లో ఎనిమిది చిత్రాలు విడుదల అవుతుండగా, అందులో లయవి రెండు సినిమాలు. మరి వీటిల్లో ఏయే సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతాయో చూడాలి.

## ధనుష్ సినిమాలో విజయ్ సేతుపతి?..




జాతీయ అవార్డు గ్రహీతలు, నటుడు ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'తమిళ్ మురుగన్'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అయితే, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ఈ ఫస్ట్ లుక్‌ను తన సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో కోలీవుడ్‌లో సరికొత్త చర్చ మొదలైంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా ఒక కీలక పాత్ర పోషిస్తున్నారంటూ ఊహాగానాలు జోరందుకున్నాయి.వండర్‌వాల్ ఫిలింస్, ప్రొడక్షన్ మైల్స్ టు గో సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. విజయ్ సేతుపతి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను షేర్ చేయడంతో, ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అభిమానులు అంచనా వేస్తున్నారు. గతంలో వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై', 'అరసన్' వంటి చిత్రాల్లో విజయ్ సేతుపతి నటించారు. ఈ నేపథ్యంలో తాజా ప్రచారానికి మరింత బలం చేకూరింది.ధనుష్, వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా ఘనవిజయం సాధించాయి. ఇప్పుడు ఈ శక్తివంతమైన కలయికకు విజయ్ సేతుపతి కూడా తోడైతే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, విజయ్ సేతుపతి నటిస్తున్నట్లు చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తదుపరి నటీనటుల వివరాలు, సినిమా విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత రావాల్సి ఉంది.



## ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై పుకార్లు

### అలాంటిదేమీ లేదంటూ టీమ్ వెల్లడి



జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా జూలై 18న తారక్ కీలక ప్రకటన చేయనున్నారని, అభిమాన సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించ నున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారం సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారడంతో తాజాగా ఎన్టీఆర్ టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి విజయాన్ని అందుకున్న నేపథ్యంలో, అదే తరహాలో జూనియర్ ఎన్టీఆర్ కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారనే ఊహాగానాలు మరింత బలపడ్డాయి. గతంలో 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించడం, అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం కావడం వంటి పరిణామాలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వార్తలన్నింటికీ ఎన్టీఆర్ టీమ్ ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనతో చెక్ పడింది. టీమ్ విడుదల చేసిన ప్రకటనలో, జూలై 18న రాజకీయ ప్రకటన ఉంటుందంటూ ప్రచారంలో ఉన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ఆ రోజు నిర్వహించబోయే కార్యక్రమం 'ఊరు వాడ' పేరుతో ఇప్పటికే ముందుగానే ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఒక సామాజిక కార్యక్రమమని వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా 'ఊరు వాడ' కార్యక్రమం లక్ష్యం, ఉద్దేశ్యం, విజన్‌ను ప్రజలకు పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. దీనికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలిపింది. 'ఊరు వాడ' కార్యక్రమానికి సంబంధించిన వేదిక, సమయం, పూర్తి కార్యాచరణ వివరాలను త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా వెల్లడిస్తామని టీమ్ పేర్కొంది. అలాగే మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ఖాతాలు ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేసింది. ఎలాంటి వార్తనైనా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే ప్రచురించాలని కోరుతూ, తప్పుడు ప్రచారం వల్ల అభిమానుల్లో అనవసర గందరగోళం ఏర్పడుతుందని తెలిపింది.

## మహేశ్‌బాబు కుటుంబంలో పెళ్లి సందడి

### కొరియన్ అమ్మాయితో సిద్దార్థ్ గల్లా నిశ్చితార్థం



సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు సిద్దార్థ్ గల్లా త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. కొరియాకు చెందిన యువతి హాయిన్ (జిన్నీ)తో ప్రేమలో ఉన్న సిద్దార్థ్, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఈ శుభకార్యానికి మహేష్ బాబు కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు హాజరై సందడి చేశారు. మహేష్ బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఎంగేజ్‌మెంట్ వేడుకకు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను షేర్ చేస్తూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఈ ఫొటోలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోల్లో నమ్రతతో పాటు మహేష్ బాబు సోదరీమణులు, కుటుంబ సభ్యులు కనిపించారు. ముఖ్యంగా మహేష్ అన్న దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా అరుదుగా పబ్లిక్‌లో కనిపించే భారతి ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో అభిమానులు ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సిద్దార్థ్ గల్లా ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు గల్లా జయదేవ్ మరియు పద్మావతి దంపతుల చిన్న కుమారుడు. ఆయన అన్న అశోక్ గల్లా ఇప్పటికే హీరోగా టాలీవుడ్‌లో అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం అశోక్ గల్లా నటిస్తున్న 'వీసా' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇక సిద్దార్థ్ గల్లా మాత్రం సినీ రంగానికి దూరంగా ఉండి కుటుంబ వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కొరియన్ యువతి హాయిన్‌తో ప్రేమలో ఉన్న ఆయన, ఇప్పుడు కుటుంబ సభ్యుల అంగీకారంతో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

# వరుణ్ 'కొరియన్ కనకరాజు' టీజర్..

## రాయలసీమ టు కొరియా హారర్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కొరియన్ కనకరాజు టీజర్ విడుదలైన తర్వాత సినిమాపై హైప్ మరింత పెరిగింది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఆ హారర్ కామెడీ మూవీలో ఎంటర్టైన్మెంట్, థ్రిల్, యాక్షన్ ను కొత్త తరహాలో చూపించే ప్రయత్నం చేసినట్లు టీజర్ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. ముఖ్యంగా రాయలసీమ నుంచి కొరియా వరకు సాగే స్టోరీ లైన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్ ప్రారంభం నుంచే కొత్తదనాన్ని చూపించే ప్రయత్నం కనిపిస్తుంది. ఒకవైపు సాధారణ రాయలసీమ యువకుడిలా కనిపించే కనకరాజు.. మరోవైపు స్టైలిష్ కొరియన్ మాఫియా బాస్ గా వరుణ్ తేజ్ కనిపించడం కథపై క్యూరియాసిటీని పెంచుతోంది. ఆ రెండు భిన్నమైన షేడ్స్ ను ఎలా కలిపారన్న అంశాన్ని మాత్రం మేకర్స్ పూర్తిగా బయటపెట్టకుండా సస్పెన్స్ కంటిన్యూ చేశారు.వరుణ్ తేజ్ లుక్ టీజర్ లో మెయిన్ అట్రాక్షన్ గా నిలిచింది. రాయలసీమ యువకుడి పాత్రలో చాలా న్యాచురల్ గా కనిపించడంతో పాటు, కొరియన్ అవతార్ లో స్టైలిష్ గా, ఇంటెన్స్ గా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. రెండు విభిన్న పాత్రల్లో కూడా ఆయన చూపించిన బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాపై అంచనాలను పెంచేలా ఉన్నాయి. టీజర్ లో మరో స్పెషాలిటీ కామెడీ. ముఖ్యంగా వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే సన్నివేశాలు ఫుల్ గా ఎంటర్టైన్మెంట్ ను పంచేలా కనిపిస్తున్నాయి. హారర్ కామెడీకి అవసరమైన ఫన్నీ ఎలిమెంట్స్ ను దర్శకుడు ఈక్వల్ గా మిక్స్ చేసినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భయం, నవ్వు రెండింటినీ ఒకేసారి అందించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. టెక్నికల్ గా కూడా టీజర్ మంచి రెస్పాన్స్ సంపాదిస్తోంది. కొరియా లొకేషన్లను చూపించిన తీరు, ప్రతి ఫ్రేమ్ ను గ్రాండ్ గా చూపించిన సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విజువల్స్ కు తగ్గట్టుగా సంగీత దర్శకుడు ఎస్. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ కు మరింత బలం చేకూర్చింది. కొన్ని సన్నివేశాల్లో బీజీఎం థ్రిల్ ను పెంచగా, మరికొన్ని చోట్ల ఎంటర్టైన్మెంట్ కు తగ్గట్టుగా సాగింది. హీరోయిన్ గా రితికా నాయక్ నటిస్తున్న ఆ చిత్రాన్ని ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టీజర్ లో క్లియర్ గా కనిపిస్తున్నాయి. విజువల్ క్వాలిటీ, మేకింగ్ స్టాండర్డ్ సినిమాపై మరింత నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. ఇప్పుడు కొరియన్ కనకరాజు మూవీ టీజర్ కేవలం కథను పరిచయం చేయడానికే పరిమితం కాకుండా, సినిమాలో ఉండబోయే ఎంటర్టైన్మెంట్ కు చిన్న ఉదాహరణగా చూపించినట్లు అనిపిస్తోంది. ఇండో- కొరియన్ బ్యాక్ డ్రాప్, వరుణ్ తేజ్ డ్యూయల్ షేడ్స్, హారర్ కామెడీ టచ్, స్టైలిష్ విజువల్స్ కలిసి ఆ చిత్రాన్ని ఆసక్తికరంగా మార్చాయి. టీజర్ కు వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ తో ఆగస్టు 7న విడుదల కానున్న ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రిజల్ట్ ను అందుకుంటుందన్న ఆసక్తి ఇప్పుడు సినీ ప్రియుల్లో నెలకొంది.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com